
epaper.telugurekhamedia.com
TELUGU REKHA TELUGU DAILY
# తెలుగు రేఖ
సంపుటి : 01 సంచిక : 223 పేజీలు : 4 వెల : రూ. 2.00
తెలుగు దినపత్రిక
శనివారం 25 అక్టోబర్ 2025 తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ RNI No.TELTEL/2010/31853




# కర్నూలు శివారులో
# ఘోర బస్సు ప్రమాదం





- మంటల్లో కాలి బూడిదయిన బస్సు
- ప్రమాదంలో 19 నిండు ప్రాణాలు బుగ్గి
- బైకును ఢీకొని తగులబడ్డ బస్సు
- ప్రమాదం గుర్తించని డ్రైవర్లు
- బతికిబయటపడ్డ 22మంది
- పలువురికి గాయాలు..ఆస్పత్రిలో చికిత్స

కర్నూలు,అక్టోబర్24( **తెలుగురేఖ**):

యాటకందని విషాదం..తెల్లవారు జామున ఏం జరిగిందో తెలుసుకునే లోపే 19 నిండుప్రాణాలు బుగ్గిగా మారాయి. నిద్రలోనే ప్రాణాలు హరీమన్నాయి. మంటల్లో బస్సు తగలుబడుతోందన్న విషయం తెలిసే లోపు ప్రాణాలు అనంతవాయువుల్లో కలిశాయి. ఎన్నో కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. మరెందరో ఆశలను బుగ్గి చేసింది. కర్నూలు జిల్లాలో జరిగిన ట్రావెల్ బస్సు దుర్ఘటన కనీవినీ ఎరుగని విషాదాన్ని నింపింది. బస్సుకు మంటలు అంటుకుని బూడిదయ్యింది. బస్సులోనే ఈ 19మంది సజీవ దహనం అయ్యారు. తాము ఎక్కిన బస్సే శ్మశానవాటికి అవుతుందని...అందులో

2 లో..



## అంగన్‌వాడీ కేంద్రాల్లో లోపాలు సహించం..
# మంత్రి సీతక్క హెచ్చరిక..

- సరుకుల సరఫరాలో అలసత్వం వహించే కాంట్రాక్టర్లపై చర్యలు తప్పవు
- చిన్నారుల హాజరు 90% లక్ష్యం
- డిసెంబర్ లోపు సౌకర్యాలన్నీ పూర్తి చేయాలి
- మహిళా శిశు సంక్షేమ శాఖ సమీక్షా సమావేశంలో స్పష్టం చేసిన మంత్రి సీతక్క

2 లో..



# బీహార్ ప్రజలు మార్పు కోరుతున్నారు

- మహాఘట్ బంధన్ గెలుపు కోసం సమిష్టిగా సాగుదాం
- బీహార్ ఎన్నికల ప్రచారంలో మంత్రి పొంగులేటి




2 లో..

# జంగిల్ రాజ్‌పై వందేళ్లయినా చర్చిస్తారు

## ఆర్జెడి గత పాలనపై మోడీ ఘాటు వ్యాఖ్యలు

పాట్నా,అక్టోబర్24 ( తెలుగురేఖ):

బిహార్‌లో ఆర్జేడీ 'జంగల్ రాజ్' పై మరో వందేళ్లయినా చర్చ జరుగుతూనే ఉంటుందని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలు తమ దురాగతాలను దాచిపెట్టేందుకు ఎంత ప్రయత్నించినా.. ప్రజలు క్షమించరన్నారు. ప్రతిపక్షాలది 'మహాగత్‌బంధన్' కాదని.. 'లఠ్‌బంధన్ అంటే నేరస్థుల కూటమి అని విమర్శించారు. ఆ పార్టీల నేతలంతా బెయిల్‌పై బయట తిరుగుతున్నవారేనని పేర్కొన్నారు. 'మేరా బూత్ సబ్‌సే మజ్‌బూత్: యువ సంవాద్' ఆడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని మోదీ ఈ మేరకు ప్రసంగించారు. బిహార్‌లో ఆర్జేడీ పాలనలో సాగిన అకృత్యాలపై నేటి తరం యువకులకు అవగాహన కల్పించేలా భాజపా (ఃఏఖ) శ్రేణులు చొరవ తీసుకోవాలని ప్రధాని మోదీ



పిలుపునిచ్చారు. దేశంలో ఎన్డీయే సర్కారు నేతృత్వంలో అభివృద్ధి మహాయజ్ఞం జరుగుతోందన్నారు. బిహార్ సైతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. కేంద్రం, రాష్ట్రంలో స్థిరమైన ప్రభుత్వం ఉండటం వల్లే ఇది సాధ్యమైందని చెప్పారు. అందుకే.. స్థానిక యువత సైతం 'వేగంగా దూసుకెళ్తోంది బిహార్.. మరోసారి ఎన్డీయే సర్కార్' అని నినదిస్తున్నట్లు తెలిపారు. ప్రతిపక్ష నేతలకు తమలో తాము ఎలా పోట్లాడాలో, స్వప్రయోజనాలను ఎలా కాపాడుకోవాలో మాత్రమే తెలుసు. బిహార్‌ను ఆటవిక రాజ్యం నుంచి బయటకు తీసుకొచ్చేందుకు, శాంతిభద్రతలను నెలకొల్పేందుకు సీఎం నీతీశ్‌కుమార్, ఎన్డీయే నేతలు ఎంతో కృషి చేశారు. స్థానికంగా మావోయిస్టులను నిర్మూలించే దిశగా ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోంది. రాష్ట్రంలో టెక్నాలజీ, స్టార్టప్ హబ్‌లను సృష్టించాల్సిన అవసరం ఉంది. ఈ ఎన్నికలు రాష్ట్ర చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తాయి. యువత కీలక పాత్ర పోషిస్తుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# సిఎం రేవంత్‌తో నారా రోహిత్ భేటీ

## పెళ్లికి ఆహ్వానిస్తూ పత్రిక అందచేత

హైదరాబాద్, అక్టోబర్24( తెలుగురేఖ):



టాలీవుడ్ యంగ్ హీరో నారా రోహిత్ బ్యాచిలర్ లైఫ్ కు గుడ్ బై చెప్పనున్నారు. తన జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించబోతున్నారు.

2 లో..

# జూబ్లీహిల్స్ బరిలో 58మంది అభ్యర్థులు

## తుది జాబితా ప్రకటించిన ఎన్నికల అధికారి

## నియోజకవర్గంలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు

హైదరాబాద్,అక్టోబర్24(తెలుగురేఖ):

జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక బరిలో అభ్యర్థుల తుది జాబితా ఖరారైంది. నవంబర్ 11న పోలింగ్ జరిగే ఉప ఎన్నికలో 58 మంది అభ్యర్థులు పోటీపడుతున్నట్టు రిటర్నింగ్ అధికారి సాయిరాం ప్రకటించారు. మొత్తం 211 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా 81



2 లో..

# రండి కలిసి అద్భుతాలు ఆవిష్కరిద్దాం

- ఉమ్మడిగా పరిశోధనలు, సంయుక్త ప్రాజెక్టులు చేపడదాం
- ప్రఖ్యాత 'మోనాష్' యూనివర్సిటీ ప్రతినిధులకు ఆహ్వానం
- ఆస్ట్రేలియా పర్యటనలో మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక భేటీ



2 లో..

# ప్రపంచం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోంది

- ఐక్యరాజ్య సమితి పసనితీరు అందుకు తగ్గట్లుగా లేదు
- భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్

న్యూఢిల్లీ,అక్టోబర్24( తెలుగురేఖ):

ప్రస్తుతం ప్రపంచం క్లిష్ట పరిస్థితుల్లోకి వెళ్తుందని భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ అన్నారు. ఐక్యరాజ్య సమితి నిర్ణయాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దాని నిర్ణయాలు ప్రపంచ ప్రాధాన్యాలను ప్రతిబింబించలేవని వ్యాఖ్యానించారు. ఈక్రమంలో యూఎన్‌లో అంతా సరిగా లేదన్నారు. ఐరాసలో

2 లో..





## బస్సు ప్రమాద ఘటనపై రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి

### మృతుల కుటుంబాలకు 2లక్షలు, క్షతగాత్రులకు 50వేల పరిహారం

న్యూఢిల్లీ,అక్టోబర్24( తెలుగురేఖ):

కర్నూల్ జిల్లాలో ఘోర బస్సు ప్రమాదం ఘటనపై రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోడీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హైదరాబాద్ టూ బెంగళూరుకు వెళ్తోన్న కావేరీ ట్రావెల్స్ బస్సు చిన్నటేకూరులో బైకును ఢీకొనడంతో

2 లో..






# తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం

- ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్లుగా అదనపు కలెక్టర్లు

హైదరాబాద్,అక్టోబర్24( తెలుగురేఖ):

తెలంగాణ ప్రభుత్వంమరో కీలక నిర్ణయం తీసుకుంది. అన్ని జిల్లాల్లో అదనపు కలెక్టర్లని ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్లు

2 లో..

## ప్రధానమంత్రి 'వికసిత భారత్ - 2047' స్వప్నాన్ని సాకారం చేసేందుకు యువత శక్తి కీలకం

### హైదరాబాద్‌లో 17వ రోజ్ గార్ మేళా సందర్భంగా నియామక పత్రాలు అందచేసిన కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి




2 లో..

## గురుపురబ్ ఉత్సవానికి సిఎం రేవంత్‌కు ఆహ్వానం

హైదరాబాద్,అక్టోబర్24 (తెలుగురేఖ):

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసిన పంజాబ్ మంత్రులు సంజీవ్ అరోరా, గుర్మీత్ సింగ్ ఖుడియన్‌లు



2 లో..

# ప్రమాదంలో మొత్తం 19 మంది మృతి

- మృతుల్లో ఇద్దరు చిన్నారులు
- క్షతగాత్రులకు మంత్రులు అనిత తదితరుల పరామర్శ
- మృతుల కుటుంబాలకు 5లక్షలు..క్షతగాత్రుకలు 2లక్షల పరిహారం
- డిఎన్‌ఎ పరీక్షల ఆధారంగా ఆనవాళ్లు అప్పగింత
- డ్రైవర్లు ఇచ్చిన సమాచారం ఆధారంగా దర్యాప్తు
- వివరాలు వెల్లడించిన హోంమంత్రి అనిత

2 లో..

కర్నూలు,అక్టోబర్24( తెలుగురేఖ):

బస్సు ప్రమాద ఘటనలో 19 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నట్లు తెలిపారు. మృతుల్లో ఏపీ, తెలంగాణ నుంచి ఆరుగురు చొప్పున, ఒడిశా, బిహార్ నుంచి






# ప్రపంచంలో నెంబర్ వన్‌గా తెలుగుజాతి

## తెలుగు డయాస్పోరా కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

అమరావతి,అక్టోబర్24( తెలుగురేఖ):

తెలుగుజాతికి తిరుగులేదని.. ప్రపంచంలో నెంబర్ వన్‌గా తయారవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయపడ్డారు. దుబాయ్ లీమెరిడియన్ హోటల్‌లో ఏర్పాటు చేసిన తెలుగు దయాస్పోరా కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. తెలుగు వాళ్లు ఐటీ నిపుణులుగా ఇప్పుడు ప్రపంచమంతా రాణిస్తున్నారని గుర్తు చేశారు. సత్యనాదెళ్ల లాంటి తెలుగు వాళ్లు మైక్రోసాఫ్ట్ కంపెనీ సీఈఓగా ఉన్నారన్నారు. 2024 ఎన్నికల్లో కూటమి కోసం ప్రవాసాంధ్రులంతా తపించి గెలిపించారని వ్యాఖ్యానిం చారు. గల్ఫ్

2 లో..

# బస్సు దుర్ఘటనపై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దగ్భ్రాంతి

హైదరాబాద్,అక్టోబర్24( తెలుగురేఖ):



కర్నూలు బస్సు ప్రమాదంలో 19 మంది ప్రాణాలు కోల్పోయిన దుర్ఘటనపై తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు

2 లో..

## గురుపురబ్ ఉత్సవానికి సిఎం రేవంత్‌కు ఆహ్వానం

కలిశారు. పంజాబ్‌లో జరిగే 350వ 'గురుపురబ్' ఉత్సవానికి పంజాబ్ ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రుల ప్రతినిధి బృందం ఆహ్వానం అందచేసింది. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తదితరులు ఉన్నారు. మంత్రుల బృందానికి సిఎం స్వాగతించి శాలువా కప్పి సన్మానించారు.

## బస్సు ప్రమాద ఘటనపై రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి

మంటలు చెలరేగాయి. ప్రమాదం సమయంలో బస్సులో 40 మంది ప్రయాణికులు ఉండగా, అందులో బైకర్‌తో పాటు 20మంది చనిపోయినట్లు సమాచారం. ఘటనలో బస్సు పూర్తిగా దగ్ధమైంది.అయితే, బస్సు ప్రమాదంపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకు కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా, క్షతగాత్రులకు రూ. 50వేల చొప్పున పరిహారం ప్రకటించారు. బస్సు ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా స్పందించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేస్తూ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. మృతులకు సంతాపం తెలిపారు. క్షతగాత్రులు వేగంగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు వెల్లడించారు.

## సిఎం రేవంత్‌తో నారా రోహిత్ భేటీ

నటి శిరీష లేళ్లతో వివాహ బంధంలో అడుగుపెట్టనున్నారు. నారా కుటుంబంలో పండుగ వాతావరణం నెలకొంది. పెళ్లి పనుల్లో బిజీగా ఉన్న నారా రోహిత్.. శుక్రవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తన వివాహానికి రావాలని సీఎంను ఆహ్వానించారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నారా రోహిత్ – శిరీషల వివాహం ఈ నెల అక్టోబర్ 30న హైదరాబాద్‌లో అంగరంగ వైభవంగా జరగనుంది. ఈ వివాహ వేడుకలను ఏకంగా నాలుగు రోజుల పాటు అత్యంత ఘనంగా నిర్వహించేందుకు నారా కుటుంబం ఏర్పాట్లు చేస్తోంది. అక్టోబర్ 25న హల్దీ వేడుకతో పెళ్లి సంబరాలు మొదలవుతాయి. అక్టోబర్ 26న సంప్రదాయబద్ధంగా పెళ్లికొడుకు కార్యక్రమం జరగనుంది. అక్టోబర్ 28న మెహందీ వేడుక, 29న సంగీత్ నైట్ నిర్వహించనున్నారు. చివరగా, అక్టోబర్ 30న రాత్రి 10:35 గంటలకు శుభ ముహూర్తాన రోహిత్, శిరీష ఒక్కటవ్వనున్నారు. ఈ వేడుకకు సినీ, రాజకీయ రంగాల నుంచి పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు – భువనేశ్వరి దంపతులు పెద్దలుగా ఈ వివాహ వేడుకలో పాల్గొననున్నారు. రోహిత్, శిరీషల పరిచయం వెనుక ఒక ఆసక్తికరమైన నేపథ్యం ఉంది. వారిద్దరూ కలిసి నటించిన 'ప్రతినిధి?2' సినిమా షూటింగ్ సమయంలోనే స్నేహం ఏర్పడింది. అది క్రమంగా ప్రేమగా మారింది. ఇరు కుటుంబాల అంగీకారంతో గత ఏడాది అక్టోబర్ 13న హైదరాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో వీరి నిశ్చితార్థం ఘనంగా జరిగింది. అయితే, నిశ్చితార్థం జరిగిన కొద్ది కాలానికే రోహిత్ తండ్రి నారా రామ్మూర్తి నాయుడు కన్నుమూయడంతో పెళ్లిని వాయిదా పడింది. దాదాపు ఏడాది తర్వాత ఇప్పుడు పెళ్లి తేదీ ఖరారు చేశారు. సినీ పరిశ్రమలో ఈ వివాహం'ఈ ఏడాది అత్యంత ఆకర్షణీయమైన స్టార్ వెడ్డింగ్'గా నిలవనుంది.

## రండి కలిసి అద్భుతాలు ఆవిష్కరిద్దాం

**ఆస్ట్రేలియా అక్టోబర్ 24 తెలుగురేఖ:**

అడ్వాన్స్డ్ టెక్నాలజీస్, గ్లోబల్ హెల్త్ ఇన్నోవేషన్, లైఫ్ సైన్సెస్, బయో టెక్నాలజీ, మెడికల్ డివైసెస్, సస్టైనబుల్ ఇంజనీరింగ్, క్రిటికల్ మినరల్స్ రీసెర్చ్ తదితర రంగాల్లో వినూత్న ఆవిష్కరణల కోసం తెలంగాణతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని మెల్‌బోర్న్‌లోని ప్రఖ్యాత 'మోనాష్' యూనివర్సిటీ ప్రతినిధులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆహ్వానించారు. ఇక్కడి ప్రముఖ విద్యా సంస్థలను భాగస్వామ్యం చేస్తూ జాయింట్ రీసెర్చ్ ప్రోగ్రామ్స్, ప్రాజెక్టులు, ఫ్యాకల్టీ, స్టూడెంట్ ఎక్స్ఛేంజ్‌లు, కో–ఇన్నోవేషన్ ఇనిషియేటివ్స్ ను చేపట్టాలని కోరారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం మెల్బోర్న్ లోని ప్రఖ్యాత 'మోనాష్' యూనివర్సిటీని సందర్శించారు. అనంతరం ఉమ్మడి పరిశోధన, ఇన్నోవేషన్ బేస్డ్ కొలాబరేషన్, అకడమిక్ ఎక్స్ఛేంజ్ , స్టార్టప్ ల భాగస్వామ్యం తదితర అంశాలపై యూనివర్సిటీ ప్రతినిధులతో చర్చించారు. అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణను 'గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్ గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. భారత్ ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, ఏఐ ఇన్నోవేషన్ హబ్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ క్వాంటం కంప్యూటింగ్, తెలంగాణ డేటా ఎక్స్ఛేంజ్, టీ హబ్, టీ వర్క్స్ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలో వినూత్న ఆవిష్కరణలు, పరిశోధనలకు ఈ భాగస్వామ్యం మరింత ఊతమిస్తుందని మంత్రి శ్రీధర్ బాబు అభిప్రాయపడ్డారు. "గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్" మారేందుకు అవసరమైన ఎకో సిస్టం కలిగిన తెలంగాణ లాంటి రాష్ట్రాలతో కలిసి పని చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్లు యూనివర్సిటీ అకడమిక్ అఫైర్స్ వైస్–ప్రోవోస్ట్ ప్రొఫెసర్ మ్యాథ్యూ గిలెస్పీ వెల్లడించారు. రాబోయే రోజుల్లో ఉమ్మడి పరిశోధనలు, సంయుక్త ప్రాజెక్టులను చేపట్టేందుకు వీలుగా రోడ్ మ్యాప్ ను సిద్ధం చేసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీన్ రీసెర్చ్ ప్రొఫెసర్ లే హై వూ, డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ క్రిస్టోఫర్ థామ్సన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచంలో నెంబర్ వన్‌గా తెలుగుజాతి

దేశాల నుంచి తరలివచ్చి తెలుగు డయాస్పోరాకు హాజరు కావటం ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. గల్ఫ్‌లోని యూఏఈ, సౌదీ అరేబియా, కువైట్, ఒమన్, బహ్రెయిన్, ఖతార్ దేశాల నుంచి పెద్ద సంఖ్యలో తెలుగు ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడారు. 30 ఏళ్ల ముందు ఐటీని ప్రోత్సహించానని.. అబుదాబీ, దుబాయ్ ఆయిల్ ఎకానమీ నుంచి పర్యాటకం, నాలెడ్జి ఎకానమీ దిశగా నడుస్తున్నాయని తెలిపారు. 1.50 లక్షల హోటల్ రూములతో ఆతిథ్య రంగానికి పెద్ద ఎత్తున ఆదాయాన్ని ఆర్జించి పెడుతోందని తెలిపారు. గతంలో హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్ తీసుకువస్తే.. ఇప్పుడు ఏపీలోని విశాఖకు గూగుల్ తీసుకువస్తున్నామని వెల్లడించారు. దేశంలో క్వాంటం వ్యాలీ ఉండే ఏకైక ప్రాంతం కూడా ఆంధ్రప్రదేశ్ మాత్రమే అన్నారు. ప్రతీ ఇంటికీ ఒక పారిశ్రామికవేత్తను తయారు చేసి లక్ష్యాన్ని సాధిస్తామని స్పష్టం చేశారు. ఐటీ, కమ్యూనికేషన్ల రంగంలో విప్లవాత్మక మార్పులను అందిపుచ్చుకుంటున్నామని సాంకేతికత ద్వారా పాలన అందించేలా వాట్సప్ ద్వారా 730కి పైగా పౌర సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా పెట్టుబడులు ఆకర్షిస్తున్నామన్న సీఎం ..15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ విశాఖలో ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోందని తెలిపారు. మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్ధన్‌రెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రపంచం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోంది

అర్థవంతమైన సంస్కరణలు జరగాలని ఆయన పిలుపునిచ్చారు. ఇది అత్యవసరమైనప్పటికీ.. యూఎన్‌లో మార్పులు జరిగేలా ఆ సంస్కరణలు ఉండాలన్నారు. ఐరాసకు భారత్ ఎప్పుడూ బలమైన మద్దతుదారుగానే ఉంటుందని.. అలాగే కొనసాగుతుందని తెలిపారు. కానీ.. యూఎన్ నిర్ణయాలు దాని సభ్యత్వాన్ని, ప్రపంచ ప్రాధాన్యాలను ప్రతిబింబించవని వ్యాఖ్యానించారు. ఐరాస 80వ వార్షికోత్సవం నేపథ్యంలో పోస్టల్ స్టాంపు విడుదల చేసిన సందర్భంగా భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ మాట్లాడారు. వివాదాల యుగంలో శాంతి అనేది అవసరమని జై శంకర్ పేర్కొన్నారు. ఇటీవల మైనారిటీల రక్షణకు, భావ ప్రకటన, మీడియా స్వేచ్ఛా హక్కులు కాపాడేందుకు భారత్ సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలంటూ ఐరాస మానవ హక్కుల కమిషన్ ప్రస్తుత ఛైర్మన్‌గా ఉన్న స్విట్జర్లాండ్ వ్యాఖ్యానించింది. దీనికి భారత్ దీటుగా బదులిచ్చింది. ఆ దేశం జాత్యహంకారం, క్రమబద్ధమైన వివక్ష, విదేశీయులపై విద్వేషం వంటి అంతర్గత సవాళ్లను ఎదుర్కొంటున్న విషయాన్ని ప్రస్తావించింది. ముందు వాటిని పరిష్కరించుకోవడంపై దృష్టిపెట్టాలని సూచించింది. మరోవైపు.. పహల్గాంలో పౌరులపై జరిగిన ఉగ్రదాడిని ప్రపంచవ్యాప్తంగా ఖండించినప్పటికీ.. పాకిస్థాన్ తన వక్రబుద్ధిని మార్చుకోలేదు. యూఎన్ సమావేశాల్లో పదేపదే కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించడంతో పాటు భారత్‌పై నిందలు మోపే ప్రయత్నాలు చేస్తుంది. అయితే, భారత్ వీటిని ఎప్పటికప్పుడు తిప్పికొడుతుంది. ఈ పరిణామాల నేపథ్యంలో జై శంకర్ తాజా వ్యాఖ్యలు చేశారు. ఇక, గురువారం యూఎన్‌లో జరిగిన సమావేశాల్లో పాక్ దౌత్యవేత్తలు ఉగ్రవాదులను స్వాతంత్య్ర సమరయోధులుగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. అయితే, భారత్ వీటిని తీవ్రంగా వ్యతిరేకించింది.

## తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం

గా నియమిస్తూ రేవంత్‌రెడ్డి సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. జాయింట్ కలెక్టర్ పదవి రద్దు చేసి.. కొత్త బాధ్యతలని అదనపు కలెక్టర్లకు అప్పగించింది. ఈ క్రమంలో అడవి భూసర్వే, హక్కుల నిర్ధారణ, సెటిల్‌మెంట్ పనులు వీరి పరిధిలోకి రానున్నాయి. 1967 ఫారెస్ట్ యాక్ట్ కింద ఉత్తర్వులు జారీ చేసింది రేవంత్‌రెడ్డి ప్రభుత్వం. ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ పర్యవేక్షణలో అమలు చేయనుంది. అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశించింది.

## బీహార్ ప్రజలు మార్పు కోరుతున్నారు

**హైదరాబాద్ అక్టోబర్ 24 తెలుగురేఖ:**

ఎన్డీఏ కూటమి పాలనలో విసిగిపోయిన బీహార్ ప్రజలు మార్పుకోరుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ బీహార్ ఎన్నికల పరిశీలకులు, తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆర్జేడీ, వామపక్షాలతో సమన్వయం చేసుకొని సమిష్టిగా పనిచేసి మహాఘట్ బంధన్ గెలుపునకు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. బీహార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం నాడు పశ్చిమ చంపారాన్ జిల్లా, చనుపటియా అసెంబ్లీ నియోజకవర్గం ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. బీహార్ రాష్ట్ర ఇంచార్జి కృష్ణా ఆళ్వార్, ఏఐసీసీ పరిశీలకులు బీవీ శ్రీనివాస్, చాణ్‌పాటియా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ప్రమోద్ సింగ్ పటేల్ తో కలిసి పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం అనుసరించాల్సిన వ్యూహాలు, ఎత్తుగడలు కార్యాచరణపై కార్యకర్తల సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ 20 ఏళ్ల నితీష్ పాలనలో బీహార్‌లో దిగజారిన అభివృద్ధి, కేంద్ర రాష్ట్రాలలో నరేంద్రమోదీ నితీష్‌కుమార్ పాలనా వైఫల్యాలను ఇంటింటికి తిరిగి ప్రజలకు చేరవేయాలని సూచించారు. నవంబర్‌లో జరిగే పోలింగ్‌లో ఎన్డీయే కూటమికి ఊహించని షాక్ ఇవ్వాలని, 14వ తేదీన ఫలితాలతో సిఎం నితీష్ కుమార్ ప్రభుత్వాన్ని దించాలని మంత్రి పొంగులేటి కోరారు. ఎన్డీఏ దుష్టపాలన పట్ల ఓటర్లలో మరింత అవగాహన కల్పించాలన్నారు. రెండు దశాబ్దాలుగా బీహార్ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, నిరుద్యోగం, రైతుల ఇబ్బందులు, మహిళల భద్రత, కార్మికుల స్థితిగతులు, మౌలిక వసతుల లోపాలు వంటి వాటిని గుర్తించి వాటికి శాశ్వత పరిష్కారం చూపే దిశగా మహాఘట్ బంధన్ స్పష్టమైన ప్రణాళికలను రూపొందించిందన్నారు. బీహార్ అభివృద్ధి, ప్రజల సంక్షేమం లక్ష్యంగా మహాఘట్ బంధన్ పనిచేస్తుందని యువత మహిళలు రైతులు కార్మికులు అందరూ కలిసి మహాఘట్ బంధన్‌కు చారిత్రాత్మక గెలుపును అందించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే మహాఘట్ బంధన్ తరపున సిఎం అభ్యర్థిగా తేజస్వి యాదవ్, డిప్యూటీ సిఎంగా సహానీ పేర్లను కాంగ్రెస్ నేత అశోక్ గెహ్లాట్ ప్రకటించారని తెలిపారు. కానీ ఎన్డీఏ కూటమి తరపున సిఎం అభ్యర్థిగా ఎవరినీ ప్రకటించలేని దుస్థితిలో ఉన్నారని మంత్రి పొంగులేటి ఎద్దేవా చేశారు. ఇప్పటికే మహాఘట్ బంధన్ ఎన్నికల ప్రణాళిక, ప్రచారాన్ని చూస్తే ప్రజలు ఈ సారి కొత్తపాలనను కోరుకుంటున్నట్లు స్పష్టమైన సంకేతాలు కనిపిస్తున్నాయని, బలమైన అభ్యర్థులు రంగంలో ఉన్నందున గెలుపు తథ్యమని మంత్రి పొంగులేటి జోస్యం చెప్పారు.

# అంగన్‌వాడీ కేంద్రాల్లో లోపాలు సహించం.. మంత్రి సీతక్క హెచ్చరిక..

హైదరాబాద్, అక్టోబర్ 24 **తెలుగురేఖ:**

మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలో అమలవుతున్న పథకాల పురోగతిపై తెలంగాణ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారులతో (DWOs) శుక్రవారం నాడు సచివాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకుల సరఫరాలో ఎటువంటి లోపాలు ఉండకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పాలు, గుడ్లు, పప్పు, మంచి నూనె, బాలమృతం, మురుకులు, బియ్యం వంటి వస్తువుల సరఫరాపై జిల్లాలవారీగా సమీక్ష నిర్వహించిన ఆమె, కొన్ని జిల్లాల్లో సరఫరా 50 శాతానికి కూడా చేరకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో జరిగినట్లుగా సరఫరాదారులు వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించిన మంత్రి సీతక్క, అలసత్వం ప్రదర్శిస్తున్న కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేసి బ్లాక్ లిస్టులో పెట్టాలన్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించడంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ ఉండదని ఆమె స్పష్టం చేశారు. చిన్నారుల సంరక్షణలో అంగన్‌వాడీ సిబ్బంది పూర్తి బాధ్యత వహించాలని ఆదేశిస్తూ, టేక్ హోమ్ రేషన్ పంపిణీ వ్యవస్థలో పారదర్శకత కోసం ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ (FRS) విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 90 శాతం లబ్ధిదారులు FRS విధానంలో సరుకులు అందుకుంటుండగా, దేశంలోనే ఉత్తమ రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యుత్ కనెక్షన్, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్ల నిర్మాణ పనులను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఉదయం 9 గంటల లోపు అంగన్వాడీ కేంద్రాలు తప్పనిసరిగా ప్రారంభం కావాలన్నారు. కేంద్రాలు ఆలస్యంగా తెరుచుకుంటే సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతి నెల కనీసం ఒక కొత్త చిన్నారి చేరేలా చర్యలు తీసుకోవాలని, ప్లే స్కూళ్ల స్థాయిలోనే విద్యా నాణ్యత ఉండేలా తల్లిదండ్రులకు భరోసా కల్పించాలని సూచించారు. ఈ నెలలో ఇప్పటి వరకు గర్భిణుల హాజరు 80%, బాలింతల హాజరు 85% ఉండటం పట్ల మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నారుల హాజరు ప్రస్తుతం 68% ఉండగా, దాన్ని 90%కు పెంచే లక్ష్యాన్ని నిర్దేశించారు. జిల్లా అధికారులు ప్రతి నెలా పురోగతి నివేదికలను సమర్పించాలన్నారు. బాల్యవివాహాలు లేని రాష్ట్రంగా తెలంగాణ నిలవాలని పిలుపునిచ్చిన సీతక్క, ప్రతి జిల్లాలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి ఒక్క బాల్య వివాహం కూడా జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే శక్తి సదనాలు, స్టే హోమ్స్, వర్కింగ్ ఉమెన్ హాస్టళ్లను అధికారులు క్రమం తప్పకుండా సందర్శించి పర్యవేక్షించాలని సూచించారు. మంత్రి సీతక్కతో పాటు సమీక్షలో శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి 'వికసిత భారత్ - 2047' స్వప్నాన్ని సాకారం చేసేందుకు యువత శక్తి కీలకం

**హైదరాబాద్ 24 అక్టోబర్ తెలుగురేఖ:**

హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో ఉన్న భారతీయ విద్యా భవన్ ఆడిటోరియంలో ఈ రోజు జరిగిన 17వ రోజ్ గార్ మేళా సందర్భంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి, కొత్తగా ఎంపికైన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు నియామక పత్రాలు అందజేశారు. కొత్తగా నియమితులైన ఉద్యోగులను ఉద్దేశించి మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల్లో 11 లక్షలకుపైగా యువతకు ప్రధాన మంత్రి మోదీ చేతుల మీదుగా నియామక పత్రాలు ఇచ్చినట్లు తెలిపారు. ఈ ఉద్యోగాలు వికసిత భారత్ నిర్మాణంలో కీలక పాత్ర పోషించనున్నాయని ఆయన పేర్కొన్నారు. "ఇది కేవలం ఉద్యోగం మాత్రమే కాదు, దేశ అభివృద్ధిలో అర్థవంతమైన పాత్ర పోషించే అవకాశం" అని ఆయన అన్నారు. యువతను ఉద్యోగదారులుగా తీర్చిదిద్దేందుకు ప్రధాని మోదీ తీసుకున్న చర్యలను గుర్తు చేస్తూ, స్టార్టప్‌లకు అందుతున్న బలాన్ని వివరించారు. "గత 11 ఏళ్లలో ప్రధాని మోదీ నాయకత్వంలో వ్యవసాయం నుండి సాంకేతిక రంగం వరకు అనేక ఆవిష్కరణలు చోటు చేసుకున్నాయి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ డా. వీనా కుమారి దెర్మల్, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సౌతర్న్ రీజియన్ అదనపు డైరెక్టర్ జనరల్ , హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ బసబ్ ముఖోపాధ్యాయ, సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ హైదరాబాద్ జనరల్ మేనేజర్, హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ ఎస్. ఆర్. వాజ్పే, డివిజన్ కార్పొరేటర్ డా. సురేఖ బీశ్వా మరియు తెలంగాణ సర్కిల్ పోస్ట్ కౌన్సిల్ డైరెక్టర్ సి. ఎం. సంపూర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ విభాగం, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, సెంట్రల్ జీఎస్టీ, కస్టమ్స్, సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ హైదరాబాద్, మౌలానా ఆజాద్ ఉర్దూ యూనివర్సిటీ, ఐఐటీ హైదరాబాద్, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, సిఎస్ఐఆర్–ఐఐసీటి హైదరాబాద్, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఆదాయపు పన్నుశాఖ, రైల్వే మంత్రిత్వ శాఖ, విమానాశ్రయ ప్రాధికార సంస్థ, సీఐఎస్ఎఫ్, ఎస్ఎస్‌బీ వంటి వివిధ శాఖలకు చెందిన సుమారు 80 మంది అభ్యర్థులు నియామక పత్రాలు స్వీకరించారు. దేశవ్యాప్తంగా 40 ప్రాంతాల్లో 17వ రోజ్ గార్ మేళా నిర్వహించబడింది. జాతీయ స్థాయిలో, వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో కొత్తగా నియమితులైన యువతను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉద్దేశించి ప్రసంగించారు.

## కర్నూలు శివారులో ఘోర బస్సు ప్రమాదం

తాము సజీవ దహనం అవుతామని ఊహించని ఘటన ఇది. శుక్రవారం తెల్లవారుజాము సుమారు 2–3 గంటల సమయం. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తోంది. తాము వెళ్లాల్సిన చోటుకి సురక్షితంగా చేరుకుంటామనే నమ్మకంతో ప్రయాణికులు అంతా గాఢ నిద్రలో మునిగిపోయారు. ఒక్కసారిగా అనుకోని ప్రమాదం.. బైక్‌ను ఢీకొనడంతో బస్సులో మంటలు చెలరేగాయి. ప్రయాణికులు తేరుకునేలోపే మంటలు వ్యాపించి పొగ కమ్మేసింది. ఏం చేయాలో పాలుపోని స్థితిలో బస్సులోని అద్దాలు పగలగొట్టి కొందరు కిందకు దూకేశారు. మరికొందరు బస్సులోనే అగ్నికి ఆహుతైపోయారు. కర్నూలు శివారు చిన్నటేకూరులో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఈ దారుణమైన ఘటన ఎన్నో కుటుంబాల్లో విషాదం నింపింది. భయానకమైన ఘటనా స్థలి దృశ్యాలు ప్రమాద స్థాయిని కళ్లకు కడుతున్నాయి. కర్నూలు జిల్లాలో ఘోర ప్రమాదం తెలుగు రాష్ట్రాలను ఉలిక్కిపడేలా చేసింది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సులో మంటలు చెలరేగాయి. కర్నూలు శివారు చిన్నటేకూరులో జాతీయ రహదారి 44పై శుక్రవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. ప్రమాద సమయంలో బస్సులో ఇద్దరు డ్రైవర్లు, 41 మంది ప్రయాణికులు కలిపి మొత్తం 43 మంది ఉన్నారు. వీరిలో 19 మంది సజీవ దహనం కాగా.. 22 మంది స్వల్పగాయాలతో బయటపడ్డారు. డ్రైవర్లలో ఒకరు పరారవగా.. మరొకరు పోలీసుల అదుపులో ఉన్నారు. బస్సు బైక్‌ను బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బస్సు ఢీకొన్న తర్వాత ద్విచక్రవాహనదారుడు కిందపడిపోయాడు. బైక్ మాత్రం బస్సు కిందకు చొచ్చుకుపోయింది. ఆ సమయంలో బైక్‌లోని పెట్రోల్ లీక్ అవడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాద సమయంలో గాఢ నిద్రలో ఉన్న ప్రయాణికులు తేరుకొని హాహాకారాలు చేస్తూ కొందరు బయటపడగా, పలువురు మంటల్లోనే చిక్కుకున్నారు.. పోలీసులకు సమాచారం రావడంతో హుటాహుటిన అక్కడికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని కర్నూలు సర్వజన ఆసుపత్రికి తరలించారు. బస్సు మొత్తం పూర్తిగా కాలిపోయింది. ప్రయాణికుల్లో ఎక్కువ మంది హైదరాబాద్ నగరానికి చెందిన వారు ఉన్నట్లు సమాచారం. ప్రమాదం నుంచి రామిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, సత్యనారాయణ, శ్రీలక్ష్మి, నవీన్‌కుమార్, అఖిల్, జష్మిత, అకీర, రమేష్, జయసూర్య, సుబ్రహ్మణ్యం బయటపడ్డారు. హిందూపూర్‌కు చెందిన నవీన్ అనే యువకుడు బస్సు ప్రమాదంలో గాయాలైన వారిని ఆరుగురిని తన కారులో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. పుట్టపర్తి నుంచి హైదరాబాద్‌కు వస్తున్న హైమారెడ్డి బస్సులో మంటలు చెలరేగడాన్ని చూసి ఆగారు. పోలీసులకు ఆమె సమాచారం అందించడంతో వెంటనే వారు ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

## ప్రమాదంలో మొత్తం 19 మంది మృతి

నుంచి ఇద్దరు చొప్పున ఉన్నారని వెల్లడించారు. మరొకరి మృతదేహం గుర్తించాల్సి ఉంది. కర్నూలు వ్యాస్ ఆడిటోరియంలో మంత్రులు అనిత, రాం ప్రసాద్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. బస్సులో 39 మంది పెద్దవాళ్లు, నలుగురు చిన్నారులతోపాటు గుర్తు తెలియని మరో వ్యక్తి ఉన్నట్లు చెప్పారు. ప్రమాదం నుంచి ఇద్దరు డ్రైవర్లు సహా 27 మంది బయటపడ్డారు. స్వల్ప గాయాలతో ఆస్పత్రుల్లో 12 మంది చికిత్స పొందుతున్నారని వివరించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హోం మంత్రి వెల్లడించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు చెప్పారు. డ్రైవర్ ఇచ్చిన ప్రాథమిక సమాచారం మేరకు ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నట్లు వెల్లడించారు. ప్రమాదంలో మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా పూర్తిగా కాలిపోయాయన్నారు. చనిపోయిన వ్యక్తుల డీఎన్ఏ ఆధారంగా వారి కుటుంబ సభ్యులకు మృతదేహాలను అందజేస్తామన్నారు. ఈ ప్రమాదంపై 16 బృందాలతో అన్ని కోణాల్లో పూర్తి స్థాయి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. డీఎన్ఏ పరీక్షల కోసం 10 ప్రత్యేక బృందాలు పని చేస్తాయన్నారు. ప్రమాదానికి కారణాలు అన్వేషించేందుకు మరో 4 బృందాలు, రసాయన విశ్లేషణ కోసం 2 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. మంత్రి రాం ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఏపీకి చెందిన మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, క్షతగాత్రులకు రూ.2 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. బస్సు డ్రైవర్లిద్దరూ పోలీసుల అదుపులో ఉన్నట్లు కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. రోడ్డుపై పడి ఉన్న బైకును ఢీ కొట్టినట్లు బస్సు డ్రైవర్ చెప్పాడని, అంతకుముందే రోడ్డు ప్రమాదంలో బైక్ పడిపోయి ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. బైకు పైనుంచి బస్సు వెళ్లడంతో మంటలు చెలరేగాయని డ్రైవర్ చెప్పాడు. ప్రమాదానికి గల కారాణాలపై అన్ని కోణాల్లో విచారణ జరుగుతోందని ఎస్పీ వివరించారు. బస్సు ప్రమాదంలో గాయపడిన వారిని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి అనిత, రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి పరామర్శించారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న వారిని మంత్రులు పరామర్శించి వారి పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. మంత్రుల వెంట డీజీపీ హరీశ్ గుప్తా, ఎమ్మెల్యేలు గౌరు చరితా రెడ్డి, దస్తగిరి ఉన్నారు.

# జూబ్లీహిల్స్ బరిలో 58మంది అభ్యర్థులు

మంది అభ్యర్థులు అర్హత పొందారు. వారిలో వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు, పలువురు స్వతంత్రులు మొత్తం 23 మంది నామినేషన్లను ఉపసంహరించుకోగా.. 58 మంది పోటీలో ఉన్నట్లు ఆర్వో వెల్లడించారు. ఇంత మంది పోటీ చేయడం జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ చరిత్రలో ఇదే తొలిసారి. 2009 ఎన్నికల్లో 13 మంది, 2014 ఎన్నికల్లో 21 మంది, 2018 ఎన్నికల్లో 18 మంది పోటీపడగా.. 2023లో జరిగిన ఎన్నికల్లో 19 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. వారిలో భారత రాష్ట్ర సమితి అభ్యర్థి మాగంటి గోపీనాథ్ విజయం సాధించారు. అయితే, ఆయన మరణంతో ఉప ఎన్నిక రావడంతో ఈసారి పోటీలో ప్రధాన పార్టీలతోపాటు పెద్ద సంఖ్యలో స్వతంత్రులు, విద్యార్థి సంఘాల నాయకులు, రైతులు బరిలోకి దిగారు. పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలవ్వడం చర్చనీయాంశంగా మారింది. నామినేషన్ల పరిశీలనతోపాటు ఉపసంహరణ వరకు క్షణక్షణం ఉత్కంఠను రేకెత్తిస్తున్న ఈ ఉపఎన్నికలో చివరకు 58 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. పలువురు అభ్యర్థులు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను తమ ఉద్యమానికి వేదికగా మలచుకునేందుకు, తమ సమస్యలను ఫోకస్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. వివిధ కారణాలు పేర్కొంటూ నామినేషన్లు దాఖలు చేశారు. దాఖలుకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5 వేలు, ఇతరులు రూ.10 వేలు చెల్లించిమరీ నామినేషన్లు వేశారు. ప్రధానంగా ప్రాంతీయ రింగు రోడ్డు భూసేకరణ నిర్వాసితులు ప్రభుత్వ తీరును నిరసిస్తూ.. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వేశారు. 12 మంది ప్రస్తుతం రంగంలో ఉన్నారు. యాచారం ఫార్మాసిటీ భూ నిర్వాసితులు 10 మంది దాఖలు చేశారు. తగిన పరిహారం ఇవ్వలేదని, భూములు తిరిగి అప్పగించాలనేది వారి డిమాండ్. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఒక సామాజిక వర్గం తరపున 10 మంది నామినేషన్ వేశారు. ఉద్యోగ నియామక ప్రకటనలు లేవని నిరసిస్తూ నిరుద్యోగ జేఏసీ తరపున 13 మంది నామినేషన్లు సమర్పించారు. పింఛన్లు సక్రమంగా రావడం లేదని పెన్షన్‌దారుల తరపున 9 మంది సీనియర్ సిటిజన్లు నామినేషన్లు వేశారు.

తెలంగాణ ఉద్యమకారుల తరపున ఒకరు సమర్పించారు. ఇదిలావుంటే జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఓటర్ల తుది జాబితాను జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్ ప్రకటించారు. ఉపఎన్నికపై శుక్రవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 2,08,561 మంది పురుషులు, 1,92,779 మంది మహిళలు. ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత జూబ్లీహిల్స్‌లో 2,383 మంది ఓటర్లు పెరిగారు. తనిఖీల్లో భాగంగా ఇప్పటి వరకు రూ.2.84 కోట్లు స్వాధీనం చేసుకున్నాం. రూ.3.69 లక్షల విలువ చేసే 512 లీటర్ల మద్యం పట్టుబడింది. ఉప ఎన్నిక బరిలో 58 మంది అభ్యర్థులు ఉన్నందున ఒక్కో పోలింగ్ బూత్‌లో.. నాలుగు బ్యాలెట్ యూనిట్స్, ఒక వీవీ ప్యాట్ వినియోగిస్తాం అని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.

## బస్సు దుర్ఘటనపై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దగ్భ్రాంతి

ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం.. రహదారులపై భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని తెలియజేస్తోందన్నారు. ఇలాంటి విషాద ఘటనలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సులో శుక్రవారం వేమూరి కావేరి మంటలు చెలరేగాయి. బైక్‌ను బస్సు ఢీకొట్టడంతో అగ్నిప్రమాదం జరిగి 19 మంది సజీవ దహనమయ్యారు.

# సంపాదకీయం..

## బంగారం ధరలను నిర్ణయించేదెవరు ?

బంగారం ధరలను ఎవరు నిర్ణయిస్తారు..ఇది అతి పెద్ద ప్రశ్న. సామాన్యుల నుంచి అసామాన్యుల వరకు ఉన్న భేతాళ ప్రశ్న. పెట్టుబడులు పెడుతూ పోతుంటే..అమ్మకాలు పెరిగితే ధరలు తగ్గాలి. కానీ తగ్గడం లేదు. ఇటీవల ఒక్కరోజులో 9వేలు తగ్గిందని తెగ ప్రచారం చేశారు. కానీ ఎంత పెరిగితే 9 వేలు తగ్గిందో చెబితే బాగుండేది. నిజానికి ఇప్పటికే సామాన్యులు వన్ గ్రామ్ గోల్డ్‌పై మోజు పెంచుకున్నారు. గిల్టు నగలకు ప్రాధన్యం పెరిగింది. బంగారంతో పోలిస్తే దీనిని అట్టే గుర్తించలేం. ప్రపంచ వ్యాప్తంగా బంగారం నిల్వలు, పెరుగుదలపై అన్నీ భేతాళ కథలే వినిపిస్తున్నాయి. నిజానికి బంగారం మీద మోజు తగ్గించుకుంటే జీవితాలు బగుపడతాయి. బంగారంపై పెట్టే పెట్టుబడులు ఇతరత్రా రంగాలపై పెడితే మంచిది. బంగారం ధరలు పెరగడం వల్ల మనిషి ప్రాణ్యాలకు విలువ లేకుండా పోతోంది. తులం బంగారం మెడలో వేసుకుని వెళ్లినా పుటుక్కున చంపేసి లాక్కెళ్లుతున్నారు. ఇటీవల వరుసగా జరిగిన ఘటనలు చూస్తుంటే బంగారం ధరలు పెరగడంతో దొంగలు ప్రాణాలు తీయడానికి కూడా వెనకాడడం లేదు. బంగారం, వెండి ఏది ఉన్నా ప్రాణాలమీదకు రావడం ఖాయం. బంగారం, వెండి ధరలు ఇలా అనూహ్యంగా పెరుగుతూ పోతుంటే సామాన్యలు ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టక తప్పదం లేదు. బంగారానికి వన్ గ్రామ్ గోల్డ్ అర్నమెంట్లు వచ్చినట్లే ..వెండిలో జర్మన్ సిల్వర్ అందుబాటులోకి వచ్చింది. ఇది కూడా ఎవరు గుర్తించలేరు. అచ్చు వెండిలాగే ఉంటుంది. ఇప్పుడు పెళ్లిళ్ల పేరంటాల్లో జర్మన్ సిల్వర్ తళుక్కుమంటోంది. ఫోటో గ్రఫీ కోసం వన్ గ్రామ్ గోల్డ్ నగలు మెరిసి పోతున్నాయి. ప్రజలు తమవల్ల కానప్పుడు వ్యామోహం తగ్గించుకుంటా రనడానికి ఈ రెండు లోహాల వాడకాన్ని గుర్తించవచ్చు. అయితే భారతదేశంలో బంగారం ధరలు గతంలో ఎప్పుడూ లేనంతగా మరొకసారి చరిత్ర సృష్టిస్తున్నాయి. ఆగస్టు నుండి బంగారం ధరలు ప్రతివారం మూడు నుండి నాలుగుసార్లు కొత్త రికార్డులు సృష్టిస్తూ, ఆకాశాన్నంటుతున్నాయి. వరుసగా ధరల పెరుగు దలతో బంగారం ధరలు ఆల్‌టైమ్ హైని తాకాయి. అంతర్జాతీయంగా పెరుగుతున్న జియోపాలిటికల్ ఉద్రిక్తతలు, అమెరికా–చైనా వాణిజ్య యుద్ధం ప్రభావం, అలాగే అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ పెట్టుబడి దారుల నమ్మకంపై దెబ్బతీస్తున్నాయి. ఈ నేపథ్యంలో బంగారం, వెండి ధరల కదలికలపై అందరి చూపు పడింది. భారతదేశంలో బంగారం ధరల నిరంతర పెరుగుదల అంతర్జాతీయ మార్కెట్‌లోనూ గోల్డ్ రేట్ల పెరుగుదలతో సమాంతరంగా కొనసాగుతోంది. పెట్టుబడిదారులు భద్రతా ద్రవ్యంగా బంగారాన్ని ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. దీపావళి వారంలో రికార్డు స్థాయిలను తాకిన తర్వాత, అక్టోబర్ 24న భారతదేశంలో బంగారం మరియు వెండి ధరలు కొంత తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్లలో లాభాల బుకింగ్,డాలర్ బలపడటం వల్ల ధరల్లో స్వల్ప సవరణ కనిపించింది. బంగారం మరియు వెండి ధరలు పరిశీలిస్తే తాజాగా 24 క్యారెట్ బంగారం గ్రాముకు 12,507, 22 క్యారెట్ బంగారం గ్రాముకు 11,464, 18 క్యారెట్ బంగారం గ్రాముకు 9,380 గా ఉంది. వెండి కిలో ధర 1.59 లక్షలుగా నమోదైంది. దీపావళి ర్యాలీ తర్వాత ఇది మార్కెట్ సాధారణ సవరణగా పరిగణించబడుతోంది. మొత్తంగా బంగారం ధరల పెరుగుదల ఇప్పుడు కొందరికి ఆనందంగానూ ఉంది. తరతరాలుగా ఇంట్లో మూలుగుతున్న బంగారం ఉన్న వాళ్లకు ఇదో ఆస్తిగా నిలుస్తోంది. తులం బంగారంపై బ్యాంకులు కూడా 70 నుంచి 80 వేల వరకు రుణాలను ఇస్తున్నాయి. సామాన్యులకు దూరమవుతున్న బంగారం సంపన్నులకు చేరువవుతోందని చెప్పలేం. ఇప్పుడు కనీవినీ ఎరుగని రీతిలో పసిడి ధరలు రికార్డుల్ని తిరగ రాస్తోంది. దేశీయ మార్కెట్లో బంగారం ధర చుక్కలు తాకుతోంది. అంతర్జాతీయ పరిణామాలు,పండగ, పెళ్లిళ్ల సీజన్ కలిసొచ్చి పసిడి దూసుకెళ్తొంది. బుధవారం నాడు హైదరాబాద్లో రూ.1.30 లక్షలు దాటింది. మంగళవారం ఒక్కరోజే తులం రేటు దాదాపు రూ.3వేలు ఎగబాకింది. ఫలితంగా తులం బంగారం రూ.1.30 లక్షలు దాటి సరికొత్త రికార్డు సృష్టించింది. ప్రస్తుత పరిస్థితుల్లో బంగారం మీద పెట్టే పెట్టుబడులకు మంచి భద్రత ఉందన్న మాట ఎవరూ కాదనలేరు. అలాగని బంగారం పెరుగుతుందో పెరగదో, ఒక వేళ తగ్గుతుందా, ఎలాంటి పరిస్థితుల్లో తగ్గుతుంది, ఎప్పుడు జాగ్రత్త పడాలి, ఎలా జాగ్రత్త పడాలన్న అంశాలపై పూర్తి అంచనా, విశ్లేషణలు అవసరం. ఎందుకంటే ఒక్కోసారి మనం కొన్న ధరలు అలాగే ఉంటాయని అనుకోవడానికి లేదు. ఏ క్షణమైనా ధమాల్ మని అనవచ్చు. అప్పుడే బంగారం లాంటి నిర్ణయాలు తీసుకోవచ్చు. వీటిపై ఎవరూ ఏమీ చెప్పలేకపోతున్నారు. బంగారం ధర పెరుగుతుందనో, తగ్గుతుందనో ఊహించడమంటే అదొక లాటరీగానే భావించాలి. మార్కెట్ విశ్లేషకుల అంచనా కూడా ఇదే. కొందరైతే సోషల్ మీడియాలో వస్తున్న కొన్ని విశ్లేషణలు గమనిస్తే కిలో బంగారం ఖరీదు బాగా తగ్గుతుందంటున్నారు. కనుక అంతవరకు ఆగితేమంచిదని విశ్లేషిస్తున్నారు. ఒకవేళ తగ్గితే ఆడవారికి ఊరటే. మరో పక్కన ఆకాశం పైకెగురుతున్న ధర నేలచూపులు చూసే అవకాశమే ఉందని, అంతర్జాతీయ స్థాయిలో మార్పులు వస్తే తగ్గడం ఖాయమంటున్నారు.

ప్రధానంగా దుబాయ్ వంటి అరబ్ దేశాలలో, భారతదేశంలో మహిళలు బంగారాన్ని ఆభరణాలుగా చేయించుకుని ధరించేందుకు మోజు పడ తారు. అలా బంగారాన్ని దాచుకున్న వాళ్ళకి ఇప్పుడు అనూహ్యంగా ధనం వచ్చి చేరినట్లే. ఎందుకంటే కాస్త బంగారం ఉన్నా ప్రత్యామ్నాయ పెట్టుబడులకు ఉపయోగపడుతున్నాయి. వాటిపై బ్యాంకు రుణాలి స్తున్నాయి. మానవారి అవసరాలు తీరుతున్నాయి. ఏదైనా వ్యాపారాల్లో పెట్టుబడి పెట్టాలన్నా వారిని బంగారమే నిలబడుతోంది. అమెరికా షట్‌డౌన్ ఎత్తివేతపై అనిశ్చితి, యూఎస్ చైనా వాణిజ్య ఉద్రిక్తతలు వంటి పరిణామాలతో బంగారంలో పెట్టుబ డులకు మదుపర్లు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమం లోనే గోల్డ్ వెండికి గిరాకీ విపరీతంగా ఉంటోందని విశ్లేషణలు వస్తున్నాయి. భౌతిక రాజకీయ ఆర్థిక అనిశ్చిత పరిస్థితుల కారణంతో ఈ ఏడాది ఇంతవరకు బంగారం ధర 67 శాతం పెరిగింది. మార్కెట్ అనిశ్చితులు ఇలాగే ఉంటే బంగారం మోజు తగ్గించుకోవడమే శ్రేయస్కరం. ఒకప్పుడు షేర్ మార్కెట్ మీద ఇలాంటి అంచనాలతో జనం పెట్టుబడిపెట్టేవారు. అలా పెట్టుబడి పెట్టి మోసపోయిన వారూ ఉన్నారు. కాబట్టి ఈ పెరుగుదలతో ఆనందపడరాదు. మోసపోరాదు.

## మంటలు గుర్తించి కిందకు దూకా

**- ప్రాణాలతో బయటపడ్డ ఆకాశ్**

**కర్నూలు,అక్టోబర్24( తెలుగురేఖ):**

కర్నూలు జిల్లాలో వేమూరి కావేరి ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఘోర ప్రమాదానికి గురి కావడంతో పలువురు సజీవదహనమైన సంగతి తెలిసిందే. ఈ ప్రమాద సమయంలో కొందరు ఎమర్జెన్సీ ఎగ్జిట్ నుంచి దూకి ప్రాణాలను కాపాడుకున్నారు. ప్రాణాలతో బయటపడిన ప్రయాణికుడు ఆకాశ్.. ప్రమాదం జరిగిన తీరును వివరించారు. తాను దీపావళికి హైదరాబాద్ వచ్చి తిరిగి బెంగళూరు వెళ్లేందుకు బస్సు ఎక్కినట్లు చెప్పారు. బస్సులో ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చింది. హఠాత్తుగా లేచి చూడగా పెద్దఎత్తున మంటలు వచ్చాయి. వెంటనే బస్సు అద్దం పగలగొట్టి బయటకు దూకేశాను. నాతో పాటు బస్సులో నుంచి మరో ఇద్దరు బయటకు దూకారని ఆకాశ్ వివరించారు.

## పాముకాటుకు గురై డిగ్రీ విద్యార్థి మృతి



**- కేసు నమోదు చేసిన పోలీసులు**

**పెద్దపల్లి, అక్టోబర్24( తెలుగురేఖ):**

దీపావళి సెలవులకు ఇంటికి వచ్చిన డిగ్రీ విద్యార్థిని పాముకాటుకు గురై మృతి చెందింది. ఈ విషాద ఘటన పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోరూపు నారాయణపేట గ్రామంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుర్రం అక్షిత(18) అనే డిగ్రీ విద్యార్థినికి శుక్రవారం పాముకాటుకు గురై మృత్యువాత పడింది. అక్షిత సుల్తానాబాద్ లోని మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల డిగ్రీ కాలేజీలో చదువుతోంది. దీపావళి పండుగ సందర్భంగా సెలవులు కావడంతో ఇంటికి వచ్చింది. శుక్రవారం కాలేజీకి పోతా అంటే తల్లి శుక్రవారం రోజు ఎందుకు వద్దు అనడంతో ఇంటి వద్దనే ఉండిపోయింది. తండ్రి శ్రీనివాస్ దివ్యాంగుడు. వీరిది నిరుపేద కుటుంబం కావడంతో తల్లి కోమల కూలీ చేస్తేనే కుటుంబ పోషణ సాగుతుంది. దీంతో బిడ్డను ఇంటి వద్ద ఉంచి తల్లి పత్తి పంటను ఏరెందుకు కూలికి వెళ్ళింది. ఇంటి వద్ద అక్షిత కుర్చీలో కూర్చొని హోంవర్క్ చేసుకుంటుండగా పాము కాలుకు కాటు వేసింది. దీంతో వెంటనే తేరుకుని తనను ఏదో కుట్టిందని అరవడంతో ఇంటి పరిసర ప్రాంత ప్రజలు పరిగెత్తుకు వచ్చి చూడగా కుర్చీ కింద పాము ఉన్నట్లు గుర్తించారు. పామును కొడదామని లోపే అక్కడి నుంచి పారిపోయింది. విషయం తల్లికి ఫోన్ ద్వారా తెలియజేయడంతో ఇంటికి వచ్చి అక్షితను మొదటగా తీసుకువెళ్లి అక్కడి నుంచి 108 అంబులెన్స్‌లో కరీంనగర్‌కు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్ తెలిపారు. డిగ్రీ విద్యార్థి పాముకాటుతో మృతి చెందిన ఘటన గ్రామంలో విషాదం నింపింది. తల్లి, కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు గ్రామస్తులను కంటతడి పెట్టించింది. శ్రీనివాస్ గౌడ్, కోమల దంపతులకు ఇద్దరు కూతుళ్లు కాగా అక్షిత పెద్దది. ఈ మేరకు పోత్కపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# నేడే నాగుల చవితి పర్వదినం

**- పుట్టలో పాలు పోయడం ఆచారం**

**,అక్టోబర్24( తెలుగురేఖ):**




హిందూ సంప్రదాయంలో పండగలకు, ఆచారాలకు విశేష ప్రాధాన్యం ఉంది. కార్తీక మాసంలో వచ్చే అనేక పర్వదినాలు, పూజలు ఇందుకు నిదర్శనం. ఇందులో భాగంగా శనివారం వచ్చే నాగులచవితికి గాను పాములకు పాలు పోయడం అన్నదానికి విశేషమైన ప్రాధ్యాన్యత ఉంది. పాములను పూజించడం హిందూ ఆచారంలో ఓ భాగం. అయితే.. దీపావళి అమావాస్య తర్వాత వచ్చే కార్తీక శుద్ధ చతుర్థి నాడు నాగుల చవితి పండుగను జరుపుకుంటారు. కొన్ని ప్రాంతాల్లో శ్రావణ శుద్ధ పంచమి రోజు కూడా జరపుకుంటారు. కానీ తెలుగు రాష్ట్రాల్లో కార్తీక మాసంలో నాగుల చవితి పండుగ ఆచరిస్తారు. ఈ ఏడాది ఈ నాగుల చవితి ఈ నెల 25న అంటే శనివారం జరుపుకోనున్నారు. వ్యవసాయానికి దన్నుగా పాములు సహాయకారికగా ఉంటాయని ప్రతీతి. ముఖ్యంగా పంటలు నాశనం చేసే ఎలుకలను పాములు పట్టుకుని తింటాయి. ఇలా పాములకు కృతజ్ఞతగా చవితి రోజు పుట్టలో ఆలు పోయడమనే ఆచారం పుట్టిందని అంటారు. ప్రకృతి, జంతువుల పట్ల గౌరవ సూచికంగా కూడా వేడుకను చేసుకుంటారు. నాగ దేవతల పూజకు శుభ ముహూర్తం అంటూ ఏదీ ఉండదు. వేకువ జామున లేచి పుట్టలో పాలు పోయడమే ఆచారంగా వస్తోంది. నాగుల చవితి పండుగ రోజు భక్తులు పుట్టలో ఆవు పాలతో పాటు గుడ్లు వేస్తారు. చలిమిడి, చిమ్మిరి నైవేద్యంగా చేసి నాగదేవతకు సమర్పిస్తారు. అలాగే జంట నాగుల విగ్రహాలకు పాలు, పసుపు, కుంకుమతో అభిషేకం చేస్తారు. మహిళలు సౌభాగ్యం కోసం, సంతానప్రాప్తి కోసం సర్పపూజ చేస్తారు. నాగుల చవితి రోజు నాగదేవతను పూజించడం వల్ల రాహువు గ్రహం యొక్క దుష్ప్రభావాలను తగ్గించుకోవచ్చన్న ప్రచారం కూడా ఉంది. అలాగే కుజ దోషం, కాల సర్ప దోషాలు తొలగిపోతాయని నమ్మకం. ఇక పురాణాల ప్రకారం నాగుల చవితి పండుగ గురించి అనేక కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి. దాదాపు ప్రతి దేవాలయం లో నాగేంద్రుని విగ్రహాలు కనిపిస్తూ ఉంటాయి. అయితే నాగుల చవితి రోజున నాగేంద్రుడు పరమేశ్వరుడికి వాసుకిగా, శ్రీమహావిష్ణువుకి ఆదిశేషుగా మారి తోడుగా ఉంటాడట. అందుకే ఈ పవిత్రమైన నాగుల చవితి రోజున భక్తులందరూ నాగదేవతను పూజిస్తే సర్వరోగాలు తొలగిపోతాయని నమ్మకం. అంతే కాకుండా ఈ రోజున సంతానం లేని దంపతులు నాగారాధన చేస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందని కూడా భక్తులు ప్రగాఢంగా నమ్ముతారు. నాగదోషం, రాహు కేతు దోషాలు ఉన్న వారు కూడా నాగుల చవితి రోజున నాగేంద్రుడిని పూజిస్తే దోషాలన్నీ తొలగిపోతాయని విశ్వసిస్తారు.

# నేరాల రేటులో ముందున్న డబుల్ ఇంజన్ సర్కార్లు

**- బిజెపి పాలిత రాష్ట్రాల్లో అవినీతిపై ప్రశ్నించని మోడీ**

**- మేము అధికారంలోకి వస్తే అవినీతిరహిత పాలన ఇస్తాం**

**- మోడీ జంగల్ రాజ్ వ్యాఖ్యలకు ఘాటుగా సమాధానం**

**పాట్నా,అక్టోబర్24( తెలుగురేఖ):**




నేరాల రేటులో భాజపా పాలిత రాష్ట్రాలే ముందువరుసలో ఉన్నాయని, అక్కడ వారు ఏం చేస్తున్నారని తేజస్వి యాదవ్ ప్రశ్నించారు. మహాగఠ్‌బంధన్ ఈ నిరుపయోగమైన డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని కూలదోస్తుందన్నారు. ఒక ఇంజిన్ అవినీతిమయమైందని, మరో ఇంజిన్ నేరపూరితమైందని దుయ్యబట్టారు. బిహార్‌లో ఆర్జేడీ 'జంగల్ రాజ్' పై మరో వందేళ్లయినా చర్చ జరుగుతూనే ఉంటుందని ప్రధాని నరేంద్రమోదీ విమర్శించిన సంగతి తెలిసిందే. దానిపై తాజాగా మహాగఠ్‌బంధన్ సీఎం అభ్యర్థి తేజస్వీ యాదవ్ స్పందించారు. తమ కూటమి అధికారంలోకి వస్తే.. అవినీతి రహిత పాలన అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు బిహార్ రాజధాని పట్నాలో మాట్లాడారు. నీతీశ్ కుమార్ ప్రభుత్వం పాల్పడిన 55 కుంభకోణాల గురించి ప్రధాని మోదీనే వెల్లడించారు. ఆ అవినీతిపై ఇప్పటివరకు ఏం చర్యలు తీసుకున్నారు..? మోసాలు జరుగుతున్నప్పుడు, ఎలాంటి చర్యలు లేనప్పుడు దానిని జంగల్ రాజ్ అంటారని ఎత్తి పొడిచారు. ఆర్జేడీ తేజస్వి వ్యాఖ్యల వేళ.. భాజపా స్పందించింది. ఆయన్ను అవినీతిపరుడని కేంద్ర మంత్రి నిత్యానంద్‌రాయ్ అభివర్ణించారు. అవినీతికి పర్యాయపదంగా మారిన వ్యక్తి దాని గురించి మాట్లాడుతుంటే షాకింగ్‌గా ఉంది. అపారమైన సంపదను కూడబెట్టుకున్న ఈ కుటుంబం వల్ల బిహార్ వెనక్కి వెళ్లిపోయిందని వ్యాఖ్యలు చేశారు. యాదవ్ కుటుంబసభ్యులు పలు కేసులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ విమర్శలు చేశారు.దీనికిముందు బిహార్ ప్రజలనుద్దేశించి మోదీ మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేతలకు తమలో తాము ఎలా పోట్లాడాలో, స్వప్రయోజనాలను ఎలా కాపాడుకోవాలో మాత్రమే తెలుసు. బిహార్‌ను ఆటవిక రాజ్యం నుంచి బయటకు తీసుకొచ్చేందుకు, శాంతిభద్రతలను నెలకొల్పేందుకు సీఎం నీతీశ్‌కుమార్, ఎన్డీయే నేతలు ఎంతో కృషి చేశారని ధ్వజమెత్తారు.

# మన మహిళల వద్ద 24 నుంచి 25వేల టన్నుల బంగారం

**- నెటిజన్ పోస్ట్‌పై స్పందించిన ఆనంద్ మహీంద్రా**

**న్యూఢిల్లీ,అక్టోబర్24( తెలుగురేఖ):**





కొన్ని రోజులుగా భారత్‌లో బంగారం వార్తలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. భారత ప్రజలకు మరీ ముఖ్యంగా మహిళలకు పసిడి అంటే మక్కువ ఎక్కువ. వారివద్ద 24వేల నుంచి 25వేల టన్నుల బంగారం ఉందని, అది అమెరికా, జర్మనీ వంటి దేశాల వద్ద ఉన్న పుత్తడి కంటే ఎంతో ఎక్కువ అని ఓ నెటిజన్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. మంచి ఉద్దేశంతో పాటు ఆలోచింపజేసేలా ఉండే సందేశాలను ప్రముఖ వ్యాపారవేత్త ఆనంద్ మహీంద్రా సోషల్ మీడియాలో షేర్ చేస్తుంటారు. తాజాగా చిన్ననాటి అనుభవాన్ని నెటిజన్లతో పంచుకున్నారు. భారత ప్రజల ఐక్యతను ప్రతిబింబించిన సందర్భాన్ని వెల్లడించారు. ఓ నెటిజన్ వేసిన అంచనాకు సంబంధించి ఆనంద్ మహీంద్రా స్పందించారు. 'ఆకట్టుకునే గణాంకాలు' అంటూ బదులిచ్చిన ఆయన.. ఈ గణాంకాలు 60 ఏళ్ల క్రితం దేశ ప్రజల సాటిలేని దాతృత్వాన్ని గుర్తుచేస్తున్నాయి. 1962లో చైనాతో యుద్ధం నడుస్తోంది. అందుకు కావాల్సిన నిధుల కోసం కేంద్ర ప్రభుత్వం నేషనల్ డిఫెన్స్ ఫండ్‌ను ఏర్పాటుచేసి, దేశ రక్షణ చర్యల కోసం బంగారం, ఆభరణాలు విరాళంగా ఇవ్వాలని పౌరులను కోరింది. ఈనాటి ధరల ప్రకారం వేల కోట్ల రూపాయల విలువైన పుత్తడిని సేకరించారు. ఒక్క పంజాబ్ నుంచే 252 కిలోల బంగారం విరాళంగా అందిందట. అప్పుడు నా వయసు ఏడు సంవత్సరాలు. ప్రజలు విరాళాలు ఇవ్వాలని కోరుతూ కొన్ని ప్రభుత్వ ట్రక్కులు ముంబయి వీధుల్లో తిరుగుతున్నాయి. అప్పుడు నేను మా అమ్మతో కలిసి బయటే నిలబడి ఉన్నాను. ఆ పిలుపు విన్న నా తల్లి బంగారు గాజులు, హారాలను ఒక గుడ్డలో చుట్టి ట్రక్కులోని వాలంటీర్లకు అందించింది. ఎంతో నిశ్శబ్దంగా తనకు ఉన్నంతలో దాతృత్వాన్ని చాటుకుంది. ఆ దృశ్యం నా మనసులో అలా ముద్రించుకుపోయింది. ఆ స్థాయిలో స్వచ్ఛంద ఉదారతను చాటుకునే సందర్భం మరొకటి ఉంటుందా..? అని అప్పుడప్పుడు ఆశ్చర్యం వేస్తుంటుంది. దేశం ఎలాంటి పరిస్థితుల్లోనైనా తట్టుకొని నిలబడగలిగే సామర్థ్యం విధానపరమైన చర్యలపై మాత్రమే గాకుండా ప్రజల సమష్టి సంకల్పంపైనా ఆధారపడి ఉంటుంది. అందుకు ఇదొక ఉదాహరణ అని మహీంద్రా వెల్లడించారు. ఈ విరాళాలు దేశభక్తిని చాటుకున్న సందర్భం మాత్రమే కాదని దేశ ప్రజల ఐక్యత, విశ్వాసానికి చిహ్నమని రాసుకొచ్చారు. ఇటీవల కాలంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బంగారం నిల్వలు పెంచుకుంటోంది. ఆ నిల్వల మొత్తం 880 మెట్రిక్ టన్నులు దాటేసింది. గత నెల 26వ తేదీ నాటికి ఈ బంగారం విలువ 95.02 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.8.36 లక్షల కోట్లు). ఆర్‌బీఐ వద్ద ఉన్న 700.24 బిలియన్ డాలర్ల విదేశీ మారకపు ద్రవ్యంలో ఈ మొత్తం 13.5 శాతానికి సమానం. ప్రస్తుతం పది గ్రాముల బంగారం ధర రూ.లక్ష పైనే ఉన్న సంగతి తెలిసిందే. అయితే భారతీయులు ప్రతి సందర్భం లోనూ ఇలా ఐక్యతను చాటుతూ తమవద్ద ఉన్న బంగారాన్ని దేశం కోసం ఇచ్చిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.


# తాండూరు తలరాత మారపోతుంది అభివృద్ధిలో దూసుకొనిపోతుంది

**- మంత్రి వాకిటి శ్రీహరి**

**తాండూర్ అక్టోబర్ 24 తెలుగురేఖ:**



5 కోట్లతో తాండూరు నియోజకవర్గానికి క్రీడాప్రాంగణం మంజూరు చేసిన క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి భూమి కేటాయిస్తే 2 కోట్ల రూపాయల సెట్విన్ సర్వీస్ సెంటర్ కేటాయిస్తాను స్థానిక యువత 40 క్రికెట్ కిట్లను పంపిన చేసిన మంత్రి తాండూరు నియోజకవర్గంలో 50 లక్షల వ్యయంతో ముదిరాజ్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి వాకిటి శ్రీహరి గారు,ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన జనాభా ఎక్కువ అని అనుకునే వారు కానీ ఎంత జనాభా ఉంది అనేది స్పష్టత లేదు రాహుల్ గాంధీ గారు కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేస్తున్న సమయంలో వెనుక బడిన వారు ఉన్నారు వారికి వారి జనాభా దామాషా ప్రకారం ప్రాతినిథ్యం కావాలి అని నినాదం ఇవ్వడం జరిగింది బీసీలకు న్యాయం చేయాలని బీసీ బిడ్డ కాకపోయినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో కుల గణన చేపట్టడం జరిగింది అసెంబ్లీలో బిల్లులు ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది ఉభయ రాష్ట్రాల్లో ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి మత్స్య శాఖ కేటాయించడం మొదటిసారి నేను మంత్రి గా బాధ్యతలు తీసుకున్న తరువాత మత్స్య శాఖకు 123 కోట్ల రూపాయలు బడ్జెట్ కేటాయించాలని కోరగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే నిధులు కేటాయించడం జరిగింది మన దగ్గర గొలుసుకట్టు చెరువులు ఉన్నాయి,తెలంగాణ రాష్ట్రానికి ఇరు వైపులా గోదావరి కృష్ణమ్మ పారుతుంది ఇక్కడ సహజ వనరులు ఉన్నాయి.నిధులు కేటాయించడం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని ప్రభుత్వానికి నివేధించాను ఈ రాష్ట్రం నుండి వేరే రాష్ట్రాలకు చేపలను ఎక్సపోర్ట్ చేసే విధంగా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుంది రాష్ట్రం ఏర్పాటు అయినప్పుడు తెలంగాణ అప్పు 60 వేల కోట్లు ఐతే 10 ఏళ్లలో 7.5 లక్షల అప్పు చేశారు ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలన్నదే తమ ప్రభుత్వం ఉద్దేశం రాష్ట్రంలో ఏదైనా ప్రాజెక్ట్ కట్టి పూర్తి చేసినవి ఉన్నాయి అంటే అది కాంగ్రెస్ పార్టీ కట్టినవే కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో లక్షకోట్లు దోచుకున్నారు తెలంగాణ రాష్ట్రంలో పండించిన పంటను పక్క రాష్ట్రాలకు అమ్ముకోకుండా గిట్టుబాటు ధర ఇచ్చి, బోనస్ ఇచ్చి ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది దేశంలో రేషన్ కార్డు ద్వారా సన్నబియ్యం ఇస్తున్న రాష్ట్రం ఏదైనా ఉంటే అది తెలంగాణ రాష్ట్రం తడితా పీడిత ప్రజల కోసం ఆలోచించే పార్టీ కాంగ్రెస్ పార్టీ పేద ప్రజలు అందరు సన్న బియ్యాలతో భోజనం చేయాలన్న ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డు ద్వారా సన్నబియ్యం ఇస్తున్నాం యువత మత్తు వదలాలి,గ్రౌండ్ కి వెళ్ళాలని తాండూరు కు గ్రౌండ్ మంజూరు చేస్తున్నాను 5 కోట్లతో గ్రౌండ్ మంజూరు చేస్తున్నాను యువతకు ఉద్యోగావకాశాలు కోసం 2ఎకరాలు కేటాయిస్తే 2 కోట్లతో సెట్విన్ సెంటర్ మంజూరు చేస్తాను ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ప్రజలకు సేవ చేయాలని ఉన్న వ్యక్తి 90 కోట్లతో కోఠిపల్లి రిజర్వాయర్ లైనింగ్ చేయనున్నారు చివరి ఆయకట్టు వరకు నీళ్ళు ఇవ్వాలని ఆయన లక్ష్యం.



# కర్నూలు బస్సు ప్రమాదంలో ఇద్దరు టెక్కీల మృతి

**- ఒకరు ఏపీవాసి కాగా..మరొకరు తెలంగాణ వాసి**

**- ఇద్దరు అమ్మాయిలూ బెంగుళూరులో పని**



**హైదరాబాద్, అక్టోబర్24( తెలుగురేఖ):**

కర్నూలులో జరిగిన బస్సు ప్రమాదం తీవ్ర విషాదం నింపింది. ప్రమాదంలో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు మృతిచెందారు. ఏపీలోని బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం పూసపాడుకు చెందిన గన్నమనేని ధాత్రి (27), తెలంగాణలోని యాదాద్రి జిల్లా గుండాల మండలం వస్తకొండూరుకు చెందిన అనూషరెడ్డి చనిపోయారు. వీరిద్దరూ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. ధాత్రి ఇటీవల హైదరాబాద్‌లోని పెదనాన్న ఇంటికి వచ్చారు. అక్కడి నుంచి బెంగళూరు వెళ్లేందుకు గురువారం రాత్రి వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు ఎక్కి ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. విషయం తెలుసుకున్న ధాత్రి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతురాలి తల్లి వాణి, బంధువులు సంఘటనా స్థలానికి బయలుదేరి వెళ్లారు. ధాత్రి మృతికి పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సంతాపం తెలిపారు. యాదాద్రి జిల్లాకు చెందిన అనూషరెడ్డి దీపావళికి స్వగ్రామానికి వచ్చి గురువారం రాత్రి బెంగళూరుకు బయల్దేరారు. ఖైరతాబాద్‌లో బస్సు ఎక్కి ఈ దుర్ఘటనలో మృతిచెందారు. అనూష మృతితో ఆమె తల్లిదండ్రులు కన్నీమున్నీరవుతున్నారు. బస్సు ప్రమాదంలో మృతిచెందిన మరికొందరిని గుర్తించాల్సి ఉంది.

# బస్సు ప్రమాదంలో ఆచూకీలేని తల్లీకొడుకు



**పటాన్‌చెరు, అక్టోబర్24( తెలుగురేఖ):**

కర్నూలు జిల్లాలోని చిన్నటేకూరు వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నుంచి బయలుదేరిన వారు ఇద్దరు ఉన్నారు. బెంగళూరుకు చెందిన తల్లీ కుమారులు పిలోమి నాన్ బేబీ(64), కిషోర్ కుమార్(41) ఇటీవల దీపావళి పండగకు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని కృషి డిఫెన్స్ కాలనీలోని బంధువు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రాము ఇంటికి వచ్చారు. గురువారం సాయంత్రం పటాన్‌చెరు అంబేడ్కర్ కూడలి వద్ద వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు ఎక్కి బెంగళూరు బయలుదేరారు. అయితే ఈ లోపే చిన్నటేకూరు వద్ద బస్సు ప్రమాదానికి గురవడంతో వీరు క్షేమంగా ఉన్నారా లేదా? అనేది తెలియడం లేదు. వారి ఆచూకీ కనుక్కునేందుకు రాము దంపతులు కర్నూలుకు బయలుదేరి వెళ్లారు.

# కావేరి బస్సుపై తెలంగాణలో 16 చలాన్లు

**- పెండింగ్‌లో రూ.23,120 ఫైన్లు**

**- అనేక ఉల్లంఘన కేసులు ఉన్నట్లు గుర్తింపు**



**హైదరాబాద్, అక్టోబర్24( తెలుగురేఖ):**

కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాద ఘటన అనేక కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు బైక్‌ను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదానికి గురైన బస్సుపై తెలంగాణలో 16 చలాన్లు ఉన్నాయి. రూ.23,120 ఫైన్లు పెండింగ్‌లో ఉన్నాయి. 2024 జనవరి 27 నుంచి 2025 అక్టోబరు 9 వరకు ఈ బస్సు 16 సార్లు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించినట్లు తెలిసింది. 9 సార్లు నో ఎంట్రీ జోన్‌లోకి ప్రవేశించడంతో జరిమానాలు పడ్డాయి. హైస్పీడ్, డేంజరస్ డ్రైవింగ్ ఉల్లంఘనల పైనా చలాన్లు పడినట్లు తెలిసింది. ప్రమాదానికి గురైన బస్సు 9490 నంబరుతో రిజిస్టర్ అయినట్లు ఏపీ రవాణా శాఖ వెల్లడించింది. ఈ బస్సు ఫిట్‌గానే ఉందని, బైక్‌ను బలంగా ఢీకొట్టడం వల్లే బస్సులో మంటలు వచ్చాయని తెలిపింది. 'కావేరి ట్రావెల్స్ పేరిట రిజిస్ట్రేషన్ చేసి బస్సు నడుపుతున్నారు. 2018 మే 2న బస్సును డామన్ డయ్యూలో రిజిస్ట్రేషన్ చేశారు. ఈ బస్సుకు 2030 ఏప్రిల్ 30 వరకు టూరిస్ట్ పర్మిట్ జారీ అయ్యింది. ప్రమాదానికి గురైన బస్సు ఫిట్‌గా ఉంది. 2027 మార్చి 31 వరకు ఫిట్‌నెస్ ఉంది. 2026 ఏప్రిల్ 20 వరకు బస్సుకు ఇన్సూరెన్స్ ఉంది. బైక్‌ను బలంగా ఢీకొట్టడం వల్లే బస్సులో మంటలు వచ్చాయి. అన్ని కోణాల్లో పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నాం. దర్యాప్తు నివేదిక మేరకు భవిష్యత్తులో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం అని రవాణా శాఖ పేర్కొంది. 2024 జనవరి 27 నుంచి 2025 అక్టోబరు 9 వరకు ఈ బస్సు 16 సార్లు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించినట్లు తెలిసింది. 9 సార్లు నో ఎంట్రీ జోన్‌లోకి ప్రవేశించడంతో జరిమానాలు పడ్డాయి. హైస్పీడ్, డేంజరస్ డ్రైవింగ్ ఉల్లంఘనల పైనా చలాన్లు పడినట్లు తెలిసింది. అయితే ఇప్పటి వరకు వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు యజమాన్యం ఇంక స్పందించిక పోవడం అనేక అనుమానాలకు దారి తీస్తోంది.

# కాకతీయ యూనివర్సిటీ అంతర్ కళాశాలల క్రీడలను ప్రారంభించిన వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కే. ప్రతాపరెడ్డి



**హన్మకొండ, అక్టోబర్ 24, తెలుగు రేఖా:**

కాకతీయ యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల రెండవ దఫా క్రీడలు కాకతీయ యూనివర్సిటీ మైదానంలో అట్టహాసంగా ప్రారంభించడం జరిగింది దీనికి ముఖ్య అతిథులుగా కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కే.ప్రతాపరెడ్డి , ప్రొఫెసర్ మనోహర్ ప్రిన్సిపల్ యూనివర్సిటీ కాలేజ్ మరియు స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ ప్రొఫెసర్ వై. వెంకయ్య పాల్గొనడం జరిగింది .దీనికి ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ ఎస్ కుమారస్వామి వ్యవరించారు ఈ క్రీడలు మూడు రోజులపాటు జరగనున్నాయని అదేవిధంగా మొత్తం ఐదు క్రీడలలో సాఫ్ట్ బల్,బాల్ బ్యాడ్మింటన్,ఖో ఖో,హ్యాండ్ బాల్ మరియు అక్టోబర్ 25 రోజున ఉదయం 5 గంటలకు క్రాస్ కంట్రీ జరుగుతుంది .ఇందులో దాదాపు 500 మంది విద్యార్థులు ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల నుండి పాల్గొనడం జరిగింది . క్రీడలతోపాటు కాకతీయ యూనివర్సిటీ జట్టును కూడా ఎంపిక జరుగుతుందని ఆర్గనైజేషన్ సెక్రటరీ డాక్టర్ ఎస్ కుమారస్వామి తెలపడం జరిగింది ఈ సందర్భంగా కొత్తగా ఏర్పడిన కాకతీయ యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ జె. సోమన్న ,సెక్రెటరీ డాక్టర్ కే సునీల్ రెడ్డి , ట్రెజరర్ ఎస్ కిరణ్ గౌడ్ ,మరియు వైస్ ప్రెసిడెంట్ బొల్లం రమేష్ మరియు మిగతా కమిటీ సభ్యులు వి సీ ముందు యూనివర్సిటీ క్రీడల అభివృద్ధికి సంబంధించి కొన్ని ప్రతిపాదనలు ఉంచడం జరిగింది దీనికి స్పందిస్తూ వీసీ కాకతీయ యూనివర్సిటీ క్రీడల అభివృద్ధికి అన్నివేళలా తాను తోడుగా ఉంటానని హామీ ఇవ్వడం జరిగింది . అదేవిధంగా ప్రతి ఒక్కరి జీవితంలో క్రీడలు ముఖ్యపాత్ర పోషిస్తాయని దీనివల్ల మానసిక, శారీరక, సాంఘిక పరిపక్వత పెరుగుతుందని ప్రతి ఒక్కరూ క్రీడలలో పాల్గొని వారి యొక్క ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని ఆరోగ్యమే మహాభాగ్యం



అన్న మాటను గుర్తు చేస్తూ ప్రతి ఒక్కరూ వారి దినచర్యలో వ్యాయామానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని వైస్ ఛాన్సలర్ క్రీడల పట్ల తనకున్న అనుభవాన్ని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిద కళాశాలల ఫిజికల్ డైరెక్టర్స్ పాల్గొన్నారు

# కులం - మానవతను చంపిన ధర్మం!



పదవి ఎంత ఉన్నా, కులం నీడ ఎంతగా వెంటాడుతుందో ఇది భారతదేశపు విషాద సత్యం...
నువ్వు ఐఏఎస్ అయినా సరే,
ఐపీఎస్ అయినా సరే,
సుప్రీంకోర్టు జడ్జి అయినా సరే,
రాష్ట్రపతి అయినా సరే –
ఈ దేశంలో నీ కులం నిన్ను విడిచిపెట్టదు. అది నీ ప్రతిభను కాదు, నీ జన్మను కొలుస్తుంది. ఇదే మన దేశపు వాస్తవం, ఇదే మనం "ధర్మం" అని పిలుస్తున్న చీకటి వ్యవస్థ.

కులం – మనిషి పుట్టుకతోనే వేసిన ముద్ర

భారతదేశంలో కులం అనే వ్యవస్థ శతాబ్దాలుగా ఒక "అనధికార రాజ్యాంగం" లా పనిచేస్తోంది. ఒక బిడ్డ జన్మించే క్షణానికే అతని భవిష్యత్తు నిర్ణయమవుతుంది – ఏ వృత్తి చేయాలి, ఎవరి ఇంట్లో పెళ్లి చేసుకోవాలి, ఎవరితో కూర్చోవాలి అనే తీర్పు సమాజం ముందే ఇచ్చేస్తుంది. వేదకాలం నుంచీ "వర్ణాశ్రమ ధర్మం" పేరుతో మొదలైన ఈ వ్యవస్థ, తరతరాలుగా మానవతను చంపుతూ వచ్చింది. ధర్మశాస్త్రాలు, పౌరాణిక కథలు, సాంప్రదాయాలు ౹ ఇవన్నీ కలిసి కులాన్ని "సహజం"గా చూపించాయి. కానీ నిజానికి అది సహజం కాదు, బలవంతంగా మనసులో నాటిన భయం.

స్వాతంత్ర్యం వచ్చిందిగానీ ౹ మనసులు ఇంకా బానిసలే

1947లో దేశం స్వతంత్రం అయ్యింది. కానీ 1950లో రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి మాటలు దేశం మొత్తం ఒక హెచ్చరికగా మారాయి.

"భారతదేశం రాజకీయంగా స్వతంత్రం అయినా, సామాజికంగా ఇంకా బానిసగా ఉంది." రాజ్యాంగం అసమానతకు వ్యతిరేకంగా చట్టాలు ఇచ్చింది. కానీ చట్టం మారడం ఒకటి ౹ మనసు మారడం మరొకటి. సమాజం మనసు మాత్రం ఇంకా కులపు గొలుసుల్లో బంధించబడి ఉంది.

విద్య, హోదా ఉన్నా ౹ కులం వెంటాడుతూనే ఉంది

ఒక ఐఏఎస్ అధికారి రాష్ట్రాన్ని నడిపినా, ఒక ఐపీఎస్ నేరాలను అణచినా, ఒక జడ్జి రాజ్యాంగాన్ని కాపాడినా అతని ప్రతిభను కాదు, కులాన్ని గమనించే మనసు ఇంకా చీకటిలోనే ఉంది. సుప్రీంకోర్టు జడ్జిగా ఎదిగిన ఒకరు కూడా, తన గ్రామానికి వెళ్లినప్పుడు "మా వాడి కులం ఏది?" అని వినిపించడమే ఈ దేశపు సిగ్గు. ఇది కేవలం వివక్ష కాదు ౹ ఇది మానసిక హింస. ప్రతిభకు బదులు జన్మ ఆధారంగా విలువలు కొలవడం, ప్రజాస్వామ్యానికి అత్యంత పెద్ద ద్రోహం.

కులం మరియు హింస – ఒక దాగిన యుద్ధం

ప్రతీ సంవత్సరం వందలాది కేసులు "కుల హింస" పేరుతో నమోదవుతుంటాయి.

దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలపై దాడులు, హత్యలు, సామాజిక బహిష్కరణలు ఇంకా జరుగుతూనే ఉన్నాయి. భారతదేశం అంతరిక్షంలోకి వెళ్తున్నా, మన గ్రామాలు ఇంకా కులచిహ్నాలతో విభజించబడి ఉన్నాయి. మహారాష్ట్రలోని ఖేర్‌లాన్‌జి ఘటన, తమిళనాడులోని ధర్మపురి ఘటన, తెలంగాణలో ఇంటర్‌కాస్ట్ పెళ్లి చేసిన జంటలపై జరిగిన దాడులు ఇవి మన సమాజం ఇంకా ఎంత వెనుకబడి ఉందో చూపించే ఉదాహరణలు. "కులం మనిషిని రక్షించదు, న్యాయం రక్షించాలి."

ధర్మం పేరుతో దౌర్జన్యం

"ఇది మన సంప్రదాయం", "ఇది మన ధర్మం" అని చెప్పి, కులవ్యవస్థను న్యాయంగా చూపించడం అనేది శతాబ్దాలుగా కొనసాగిన మోసం. ధర్మం అంటే మనిషిని కాపాడేది కావాలి. కానీ ఇక్కడ ధర్మం మనిషిని మానసికంగా, శారీరకంగా చంపుతోంది.

అంబేద్కర్ గారు స్పష్టంగా చెప్పారు:

"హిందూ ధర్మం కులవ్యవస్థకు మూలం. కాబట్టి సమానత్వం కావాలంటే మనం ధర్మం కంటే మానవత్వాన్ని ఎంచుకోవాలి." ధర్మం పేరుతో పుట్టిన ఈ కట్టుకథలు నిజానికి మానవ విలువలకు వ్యతిరేకం.

కులవాదం – ఆధునిక రూపంలో

ఈ రోజుల్లో కులం కొత్త వేషం వేసుకుంది. ఫేస్‌బుక్, వాట్సప్, సోషల్ మీడియా గ్రూపులలో కూడా "మా కుల సంఘం", "మా వంశం", "మా జాతి" అంటూ వర్గాలుగా విభజనలు కొనసాగుతున్నాయి. ఉద్యోగాల్లో, రాజకీయ పార్టీల్లో, విద్యాసంస్థల్లో కూడా కులం ఒక అదృశ్య శక్తిగా పనిచేస్తోంది. ఎన్నికల్లో అభ్యర్థులు కులం ఆధారంగా ఎంపిక అవుతారు.

ఇది ప్రజాస్వామ్యాన్ని మలినం చేసే అత్యంత ప్రమాదకరమైన వ్యాధి.

కొత్త భారతం – కులరహిత ఆలోచనతోనే సాధ్యం

మన దేశం డిజిటల్ యుగంలోకి అడుగుపెట్టింది. కానీ మన ఆలోచన మాత్రం ఇంకా మధ్యయుగాల నుండి బయటపడలేదు. టెక్నాలజీ కాదు, మన దృక్పథం మారాలి. మనిషి విలువ అతని జన్మతో కాదు, అతని మానవతతో కొలవాలి. అప్పుడే రాజ్యాంగం చెప్పిన సమానత్వం నిజమైన అర్థం పొందుతుంది. పాఠశాలల్లోనే పిల్లలకు "కులం లేదు ౹ మనం మనుషులం" అనే బోధన ఇవ్వాలి. పబ్లిక్ డిస్కోర్స్‌లో కులపేర్లను వాడటం మానుకోవాలి. సామాజిక న్యాయం అంటే కేవలం రిజర్వేషన్ కాదు ౹ ఆలోచనా మార్పు.

మానవతే అసలైన ధర్మం

కులం మనిషిని చంపుతుంది మానసికంగా, సామాజికంగా, కొన్నిసార్లు శారీరకంగానూ. కానీ మానవత మాత్రం రక్షిస్తుంది. ఇది కేవలం చట్టపరమైన పోరాటం కాదు ౹ ఇది మనసు యొక్క విప్లవం. మన దేశం నిజంగా గొప్పదిగా మారాలంటే, కులం అనే మలినాన్ని మనసు నుంచి తుడిచేయాలి. "కులం చంపుతుంది ౹ మానవత రక్షిస్తుంది."

"మనిషి విలువ అతని కులంలో కాదు, అతని హృదయంలో ఉంటుంది." ఈ దేశానికి నిజమైన "ధర్మం" కులం కాదు
మానవత, సమానత్వం, ప్రేమ.
అవి మన రాజ్యాంగం ఆత్మ.
కులరహిత భారతం కోసం మనం మాట్లాడాలి, రాయాలి, ఆలోచించాలి, మారాలి.
అప్పుడే ఈ దేశం "మహానభావుల కలల భారత్" అవుతుంది.

# గ్రామీణ రహదారుల అభివృద్ధికి పెద్దపీట

# రూ.74.43 కోట్ల నిధుల మంజూరు

**- కొత్త రహదారులతో పల్లెల ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుంది- మంత్రి సీతక్క**

**హైదరాబాద్ అక్టోబర్ 24 తెలుగురేఖ:**

ములుగు జిల్లా సహా పలు జిల్లాల్లో గ్రామీణ రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి లక్ష్యంగా పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ఈ దఫా మొత్తం రూ.74.43 కోట్ల నిధులతో 32 కొత్త రహదారుల నిర్మాణానికి పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ, గ్రామీణ రహదారులు పల్లె ప్రజల జీవితాల్లో కీలకమైన పాత్ర పోషిస్తాయని, కొత్త రహదారుల నిర్మాణంతో రవాణా సౌకర్యం మెరుగుపడటమే కాకుండా స్థానిక ఆర్థిక వ్యవస్థ కూడా బలపడుతుందని పేర్కొన్నారు. పల్లెల మధ్య అనుసంధానం పెరిగి, రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను



సులభంగా మార్కెట్లకు తరలించగలరని, విద్యార్థులు, వృద్ధులు, గర్భిణీలు వంటి వర్గాలకు ప్రయాణ సౌలభ్యం కలుగుతుందని ఆమె తెలిపారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ, "గ్రామీణ ప్రాంత అభివృద్ధి మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ప్రతి పల్లె అభివృద్ధి చెందేలా, మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా సీఎం రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది. రహదారులు, తాగునీరు, విద్యుత్, గృహ నిర్మాణం, సంక్షేమ పథకాలు.. ప్రతి రంగంలో ప్రభుత్వం ప్రజల అవసరాలకు తగ్గట్టుగా చర్యలు తీసుకుంటోంది," అని తెలిపారు. ములుగు జిల్లాలోని గిరిజన ఆదివాసి ప్రాంతాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, అక్కడి పల్లెలు కూడా అభివృద్ధి పథంలో దూసుకుపోవాలన్న దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. కొత్త రహదారుల నిర్మాణం ద్వారా పల్లెల మధ్య రవాణా సౌకర్యం మాత్రమే కాకుండా పర్యాటక అవకాశాలు కూడా పెరుగుతాయని ఆమె అభిప్రాయపడ్డారు. "ప్రభుత్వం మంజూరు చేసిన ఈ రూ.74.43 కోట్ల నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కొత్త దశకు చేరుతుంది. రహదారులు మాత్రమే కాదు, గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలే మారిపోతాయి. మరింత అభివృద్ధి పల్లెల తలుపు తడుతుంది" అని సీతక్క స్పష్టం చేశారు.

# పోచారంలో ప్రహారీగోడ తొలగింపు

**- హైడ్రా చర్యలతో స్థానికుల ఆనందం**

**హైదరాబాద్,అక్టోబర్24( తెలుగురేఖ):**

ప్రభుత్వ భూముల ఆక్రమణదారులపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నది. ఈ ఏడాది కాలంలో ఇప్పటి వరకు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో సుమారు రూ.60 వేల కోట్ల విలువైన వెయ్యి ఎకరాల ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుంది. చెరువులు, కుంటలకు కబ్జాదారుల నుంచి విముక్తి కల్పించి పునరుద్ధరిస్తున్నది. గ్రేటర్ హైదరాబాద్ పోచారంలో అక్రమంగా నిర్మించిన ప్రహరీ గోడను శుక్రవారం హైడ్రా తొలగించి 8 ఏళ్ల సమస్యకు పరిష్కారం చూపించింది. 1978లో 27 ఎకరాల ఎకరాల్లో 400 ప్లాట్లతో జీపీ లే అవుట్ ఏర్పాటు చేయగా.. అందులో ఓ వ్యక్తి 6.18 ఎకరాల భూమిని తమదే అంటూ అక్రమంగా ప్రహరీ నిర్మించాడు. అక్రమ



ప్రహరీపై సుమారు 8 ఏళ్లుగా పోరాడిన లే అవుట్ సొసైటీ.. చివరకు ప్రజావాణిలో హైడ్రాకు ఫిర్యాదు చేసింది. సొసైటీ సభ్యుల ఫిర్యాదుపై క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టిన హైడ్రా కమిషనర్ రంగనాథ్.. అక్రమంగా నిర్మించినట్లు గుర్తించారు. దీంతో ప్రహరీ గోడను తొలగించారు హైడ్రా సిబ్బంది. 8 ఏళ్లుగా ఉన్న సమస్యకు హైడ్రాతో పరిష్కారం లభించడంతో హైడ్రా చర్యల పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు స్థానికులు.

Printed and Published by V. SHANKARA SHARMA, H. NO-9-18/7, KRISHNANAGAR, VILLAGE BOMMAKAL, MANDAL & DISTRICT-KARIMNAGAR TELANGANA-505001, RNI No. TELTEL/2010/31853, Editor: Eldi Ravinder, telugurekha1984@gmail.com, 9963197573.